కథ

# తొలగిన తెరలు

కె.వాసవదత్త రమణ

"మంజూ! సాయంత్రం మనింటికి ఓ ఇంటరెస్టింగ్ గెస్టు వస్తున్నాడు" శశాంక్ అన్నాడు ఫోన్‌లో.

"ఎవరతను?" మంజుల ఆసక్తిగా అడిగింది.

"నీకులాగే సాహిత్యం అంటే చెవి కోసుకుంటాడు. నీకు చాలా చాలా నచ్చుతాడు" శశాంక్ నవ్వు గట్టిగా వినిపించింది ఫోన్‌లో.

"అబ్బా! చాల్లెండి మీరు మీ వెటకారాలూనూ. ముందు సాయంత్రం త్వరగా వచ్చేయండి" ముద్దుగా విసుక్కొంది ఆమె.

★ ★ ★

సాయంత్రం అవుతూనే ఇల్లంతా నీటుగా సర్ది, వంట పూర్తిచేసింది. లేత ఆకాశం రంగు చీర కట్టుకొని, జడలో సన్నజాజులు తురుముకొంటుంటే కారు హారను వినిపించింది. నవ్వుతూ ఎదురెళ్ళింది శశాంక్‌కి!

"మంజూ! ఇతను చరణ్! మా ఆఫీసులో కొత్తగా జాయిన్ అయ్యాడు కన్సల్టెంట్‌గా. చరణ్! షీ ఈజ్ ఎవ్రీథింగ్ టు మీ! మై వైఫ్ అండ్ మై లైఫ్ మంజుల"

అతని పొగడ్తకు ఎరుపెక్కిన బుగ్గలతో చిన్నగా నవ్వేస్తూ అతిథికి నమస్కరిస్తున్న ఆమె చేతులు అలాగే ఆగిపోయాయి.

అతను ఆమె వంక చూస్తూ అలాగే స్థాణువైపోయాడు. ఇద్దరూ అలాగే ఒకరి వంక మరొకరు చూస్తూ శిలల్లా నిలబడిపోయారు.

"చరణ్! మీరు మాట్లాడుతూ వుండండి. నేను రిఫ్రెష్ అయి క్షణంలో వచ్చేస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు శశాంక్.

ముందుగా చరణ్ తేరుకున్నాడు.

తడబాటుగా "మీరు..మీరు..ఎన్నేళ్ళకి?" అన్నాడు. అతని కళ్ళలో ఆనందం... ఆశ్చర్యం...

మంజుల అతని వంక మౌనంగా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

"సారీ చరణ్, నాకు నీతో మాట్లాడాల్సిందేమీ లేదు" కొంచెం కఠినంగా అందామె!

"అలా అనకండి! ఒక్కసారి నా మనసు విప్పి మీతో మాట్లాడే అవకాశమివ్వండి! ప్లీజ్!" అతని అర్థింపుకి ఆమె కొంచెం మెత్తపడింది.

"కూర్చో" అంటూ సోఫా వైపు చూపించింది.

ఆమె వంక ఆరాధనగా చూస్తూ, "ఇన్నేళ్ళకి మిమ్మల్ని చూసిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. శశాంక్‌గారు మీకు సరైన జోడి!" అన్నాడతను.

మంజుల చటుక్కున అతని వంక చూసింది. తన పట్ల అతని కళ్ళల్లో కురుస్తున్న అభిమానం ఆమెను కట్టిపడేసింది. ఎప్పుడో అతన్ని అతనికి పదిహేడేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు చూసింది. మళ్ళీ ఇన్నాళ్ళకు ఇదే కలవడం!

ఆమె మనస్సంతా హఠాత్తుగా చికాకుగా అయ్యింది.

శశాంక్ హాలులోకి వస్తూ, "ఏమిటోయ్ చరణ్! అలా కూర్చుండిపోయావు. నువ్వూ, మంజూ ఈపాటికి 1960లోకి వెళ్ళిపోయి డీప్ డిస్కషన్‌లో మునిగిపోయి ఉంటారనుకుంటే...!" అతని భుజం మీద చరుస్తూ పక్కగా కూర్చున్నాడు.

అతను చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

"మంజూ! గెస్టుని ఇలా వదిలేసి లోపలేం చేస్తున్నావు?" మళ్ళీ శశాంకే అన్నాడు లోపలికి చూస్తూ!

"భోజనం వడ్డించాను. డిన్నర్‌కి రండి" మంజుల తిరిగి సమాధానం లోపల్నుంచే చెప్పింది.

భోజనం అవ్వగానే చరణ్ వీడ్కోలు తీసుకొని గబగబా వెళ్ళిపోయాడు. అతనలా వెళ్ళగానే, "ఏమైంది మంజూ! అలా డల్‌గా వున్నావు? ఎనీ ప్రాబ్లమ్? ఒంట్లో బాగానే ఉందిగా!" అనునయంగా అడిగాడు శశాంక్.

"ఐయామ్ ఓ.కె. చరణ్ నాకు ముందే తెలుసు! నా స్టూడెంట్! నా దగ్గరే చదివాడు!"

"అరే! అలాగా మరి ముందు చెప్పలేదేం?"

"వదిలేయండి ఆ సంగతి!" సమాధానం దాటేస్తూ అంది మంజుల.

ఆశ్చర్యంగా చూసాడతను ఆమె వంక. ఆమె మౌనం చూసి ఇక ఆ విషయం తర్కించలేదు.

★ ★ ★

మర్నాడు మధ్యాహ్నం కాలింగ్ బెల్ మోగుతుంటే తలుపు తీసింది మంజుల.

ఎదురుగా 'చరణ్!'

ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"నేను మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి ప్లీజ్ పర్మిట్ మీ!" వేడుకోలుగా అన్నాడతను.

లైటు బ్లూ కలర్ షర్టు మీద వైట్ ప్యాంటులో చాలా హ్యాండ్‌సమ్‌గా, పరిణితి చెందిన యువకుడిగా కనిపిస్తున్నాడతను, ఆమె కళ్ళకు ఇప్పుడు.

ఆమె మనస్సు గతంలోకి పరుగు తీసింది.

★ ★ ★

పెళ్లయిన కొత్తలో భర్తకి ఎక్కువగా క్యాంపుల ఉద్యోగం కావడంతో ఏమీ తోచక ఇంటర్ ట్యూషన్స్ చెప్పడం మొదలుపెట్టింది మంజుల!

అప్పట్లో ఆమెకి పరిచయమైన స్టూడెంట్ చరణ్! పరిచయమైన నెలలోనే ఇంట్లో సొంత మనిషిలా కలిసిపోయాడతను. వయసుకి మించి ఎదిగినవాడుగా కనిపించేవాడు. అతని మాటల్లో చేతల్లో ఎంతో పరిణితి ఉండేది. అలా మంజులకి బాగా క్లోజ్ అయ్యాడు.

వద్దంటున్నా వినకుండా ఇంటి పనులన్నీ చేసేవాడు. చివరికి రెండు నెలలు గడిచేప్పటికి చరణ్ లేనిదే ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి మంజులకి ఏర్పడింది.

"మేడమ్! కూరలు తెచ్చాను. మా దొడ్లో కాసినవి!"

"ఎందుకు చరణ్, నేను వద్దని చెప్పానుగా?" కొంచెం చిరుకోపంగా అంది.

"మేడమ్! కరెంట్ బిల్లు ఈ బీరువాలో పెట్టనా?"

"వద్దు! అది మా వారిది! ఆయన బీరువా ఇంకొకళ్లు తెరవడం ఆయనకు ఇష్టం వుండదు. ఆ టేబిల్ మీద పెట్టు!"

ఓ రోజు అందరు స్టూడెంట్స్ చీకటి పడుతుండగా ఇళ్ళకి వెళ్ళిపోయారు. చరణ్ మటుకు చదువుకుంటూ హాల్లో ఓ వార కూర్చున్నాడు.

"చరణ్! ఇంటికి వెళ్ళు! బాగా పొద్దుపోయింది"

ఆమె మాటలకు, "మేడమ్! ఇంకో టూ పేజెస్ వర్క్ వుంది. అది కంప్లీట్ చేసి వెళతాను" అలాగే నోట్స్ రాసుకుంటూ కూర్చున్నాడు.

"సరేలే! వెళ్ళేటప్పుడు చెప్పు!" అనుకుంటూ వంట పూర్తి చేసి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

బాత్‌రూంలోంచి బెడ్‌రూంలోకి వస్తూంటే ఎదురుగా బీరువా తలుపులు మూస్తూ చరణ్!

నిశ్చేష్టురాలైంది మంజుల!

ఒక సెకను ఆమె కళ్ళను ఆమే నమ్మలేకపోయింది. మరుక్షణంలో తేరుకొని "చరణ్!" గర్జించిందామె కంఠం.

"ఏం చేస్తున్నావు ఇక్కడ?"

"అబ్బే! ఏం లేదండి!" ఏదో దాస్తున్నట్టు, కంగారు పడుతూ అన్నాడు.


"నోర్ముయ్ అబద్ధాలాడకు. చెప్పు అసలే ఉద్దేశ్యంతో లోపలికి వచ్చావు? బీరువా ఎందుకు తీశావు?" మంజుల కళ్ళు నిప్పులు కురిపించాయి.

"నేనేం చెప్పలేను. ఏమీ లేదు!" వడివడిగా ఆమె పక్కనుంచి పరిగెడుతూ తలుపు దగ్గరగా వేసేసి వెళ్ళిపోయాడను.

కోపంతో వణికిపోతూ హాల్లోకి వచ్చింది. హాలంతా నిర్మానుష్యంగా వుంది. ఆమె గుండె ఒక్కసారిగా ఝల్లుమంది.

గోడకు కొట్టిన బంతిలా పరుగున వచ్చి బీరువా తలుపు తెరిచి చూసింది. డబ్బు, బంగారం అన్నీ పెట్టిన చోటే ఉన్నాయి. 'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకుంది.

'మరెందుకు అతను రహస్యంగా లోపలికి వచ్చాడు? తనను ఏమైనా చేయడానికా?' ఆ ఊహే ఆమె మనస్సును ముక్కలు ముక్కలు చేసేసింది.



‘ఛ! చరణ్ చిన్న పిల్లాడు. అలాంటివాడు కాదు. తను చాలా తప్పుగా ఆలోచిస్తోంది’


తనకి తాను ఎంత సర్ది చెప్పుకున్నా, ఆమె మనసు స్థిమిత పడలేదు. ‘ఆయన రాగానే ముందీ విషయం చెప్పాలి’ అనుకుంది స్థిరంగా. మళ్ళీ ‘వద్దు. అనవసర రభస! ఏది ఏమైనా రేపటి నుంచి అతన్ని తన ఇంటి లోకి మళ్ళీ అడుగు పెట్టనివ్వకూడదు’ నిశ్చయంగా అనుకుంది.

కానీ మర్నాడే కాదు, మళ్ళీ ఎప్పుడూ అతను ఆమెకు కంటపడలేదు. అసలేమయిపోయాడో కూడా తెలియలేదు. ఆ రోజు అలా ఎందుకు చేసాడో ఎన్ని సార్లు ఆలోచించినా ఆమెకు చిక్కు ప్రశ్నగానే మిగిలిపో యింది. మళ్ళీ ఇన్నేళ్ళకు అతన్ని తిరిగి చూడడం ఇదే, శశాంక్ ఆఫీసు కొలీగ్‌గా!

* * *

గతం నుంచి తేరు కుంటూ...

“చరణ్ నిజం చెప్పు? ఆ రోజు ఎందుకు నా బెడ్ రూంలోకి వచ్చావు? మళ్ళీ ఎందుకు పారిపోయావు? ఇన్నాళ్ళు ఎందుకు కనబడ కుండా ఉన్నావు? చెప్పు” మంజుల ఆవేశంగా అంది.






“చిన్నతనం కొద్దీ తెలియక పొరపాటు చేశాను. లేదా తప్పు చేశాను. నన్ను క్షమించండి” అంటాడనుకొంది.

కానీ, అతను అలా అనలేదు.

“చెప్పు చరణ్!” రెట్టించిందామె.

“చరణ్! నువ్వు ఏదో దాస్తున్నావు. అప్పటి సంఘ టన వెనుక ఏదో బలమైన కారణం ఉంది. నిజం చెప్పు. ఆ రోజు ఏం జరిగింది?” ఆమె కళ్ళు అతన్ని శోధిస్తున్న ట్టుగా చూసాయి.

* * *

“మా అక్క పేరు శాంత. మా ఇద్దరికి 10 ఏళ్ళ పైగా తేడా వుంది. మీకులాగే నన్నెంతో ప్రేమగా, అభిమానంగా చూసుకునేది. తను కల్లాకపటం తెలి యని అమాయకురాలు. తెల్లనివన్నీ పాలని నమ్మేరకం. మనుష్యుల్లో స్వార్థం వుంటుందనీ, అది తననే బలి తీసుకుంటుందని ఆమె ఊహించలేకపోయింది. ఆ స్వార్థం పేరు రమణారావు.

అతని వల్లో పడ్డ మా అక్క అతన్ని పూర్తిగా నమ్మింది. పెళ్ళి చేసుకుంటాడని ఆశపడింది. ఉత్తరాలు రాసింది. మా అమ్మ వాళ్ళకి తెలియకుండా అతనికి చాలా దగ్గరయ్యింది. ఫోటోలు తీయించుకుంది. కానీ చివరికి ఆ నీచుడు హఠాత్తుగా వేరే డబ్బున్న అమ్మాయిని పెళ్ళి చేసుకొని, మా అక్కని మోసం చేసాడు. అది తట్టుకోలేక మా అక్క ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. కానీ మా అదృష్టం కొద్దీ బతికి బయటపడింది. జరిగిన అవమానానికి నలుగురిలో తలెత్తుకోలేక, మేం చివరికి ఇళ్ళు ఖాళీ చేసి మా ఊరు వెళ్ళిపోయాం. అమ్మానాన్నలు కూడా అక్క బాగుంటే అదే పదివేలు అనుకుని తనను కాపాడారు కంటికి రెప్పలా కడుపులో పెట్టుకొని. అక్క నెమ్మదిగా మామూలు మనిషయింది.

నేను ఇంటర్‌లోకి వచ్చాను. మా ఊరు నుంచి టౌన్‌కి అప్ అండ్ డౌన్ చేస్తున్నాను. మా అక్కకు మంచి సంబంధం వచ్చింది. ఆఖరికి మా అక్కని ఒప్పించి, అమ్మావాళ్ళు ఆ సంబంధం ఖాయం చేసుకుని పెళ్ళి ముహూర్తం పెట్టుకొన్నారు. మా ఇంట్లో పండుగ వాతా వరణం ఏర్పడింది. అక్కకి పెళ్ళి కుదరడంతో అందరం చాలా సంతోషంగా వున్నాం. చాలాకాలం తర్వాత మా జీవితాల్లో ఉన్న స్తబ్దత తొలగి, ఇన్నాళ్ళకు వెలుగురేఖ తొంగి చూసిందనిపించింది.

ఓ నెల రోజులకి “అక్కా! ఏమైంది. నిన్నట్నుంచి చాలా దిగాలుగా వున్నావు?” ఆందోళనగా అడిగాను.

“ఏమీ లేదురా!” అక్క కళ్ళలో సన్నటి నీటి తెర!

“అక్కా! నిజం చెప్పు? ఏమైంది?” ఆదుర్దాగా అన్నాను.

“చరణ్!” అంటూ అక్క నన్ను పట్టుకొని భోరుమని ఏడ్చింది. నేను బ్రతిమాలి పట్టుబడితే, అప్పుడు నోరు

## సునీల్‌తో కాజల్

ఇప్పుడిప్పుడే టాలీవుడ్‌లో తనదైన గుర్తింపుని సొంతం చేసుకునే ప్రయత్నాల్లో వున్న యువ తార కాజల్ అగర్వాల్- రామ్‌చరణ్ తేజతో ‘ధీరుడు’ (ఇంకా కన్ఫర్మ్ కాలేదులెండి) సినిమాలో నటి స్తోంది. ఈ చిత్ర దర్శకుడు రాజమౌళి- హాస్యనటుడు సునీల్ హీరోగా తీయాలనుకుంటున్న ‘బంతి’ సినిమాలో కాజల్ హీరోయిన్‌గా నటించవచ్చని టాలీవుడ్ వర్గాల సమాచారం. ఓ వైపు రామ్‌చ రణ్ లాంటి క్రేజీ హీరోతో నటిస్తూనే సునీల్ లాంటి కామెడీ హీరోతో కూడా జత కట్టడం అంటే కాజల్ గడుసు అమ్మాయే అనిపించడం లేదూ!



విప్పి చెప్పింది. ఆ దుర్మార్గుడు రమణారావు మళ్ళీ కలిసాడని.

"నువ్వు రాసిన ప్రేమలేఖలు, ఫోటోలు అన్నీ నా దగ్గరే వున్నాయి. నా కోరిక కనుక ఒకసారి నువ్వు తీరిస్తే అవన్నీ నీకు తిరిగి ఇచ్చేస్తాను. లేదా ఆ ఉత్తరాలన్నీ నీ కాబోయే మొగుడికి నేను కానుకగా పంపుతాను" అతని బెదిరింపు గురించి చెప్పింది.

"అక్కా, భయపడకు!" అన్నాను ఆరిందాలా!

"నా జీవితం గురించి నాకేం భయం లేదురా చరణ్! కానీ అమ్మానాన్న గురించే బెంగ! వాళ్ళు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. తీరా ఇప్పుడీ పెళ్ళి పెటాకులు అయితే వాళ్ళు ఇంక తట్టుకోలేరు రా! నాలాంటి దాన్ని కన్నందుకు వాళ్ళు జీవితాంతం కుళ్ళి కుళ్ళి ఏడవవలసిందే!" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

నా మనసు కరిగిపోయింది.

"అక్కా! బాధపడకు! ఏదో ఒకటి చేద్దాములే! ఆ రమణారావుకు కొంచెం టైం ఇమ్మని అడుగు!"

అక్క నేను చెప్పినట్టే చేసింది. ఆవేశంలో అన్నానే కానీ, నిజానికి అక్కకీ విషయంలో నేనేం సాయం చేయగలనో నాకే తెలియదు.

అసలు ముందు అతన్ని చంపేయాలనుకున్నాను. కానీ అమ్మా, నాన్న, అక్క అందరూ గుర్తుకు వచ్చారు. ఛ! తప్పు. అలా చేయకూడదు. అక్క సమస్యకి అది పరిష్కారం కాదు. ఏం చేయాలి? ఆ ప్రేమలేఖల్ని బయటపెట్టకుండా అతన్ని ఎలా ఆపాలి?' ఇదే ఆలోచన నన్ను రేయింబవళ్ళు తినేసింది.

"అక్కా! అతను ఎక్కడుంటాడు?" అడిగాను.

"మునుపు 4వ వీధిలో ఉండేవాడు. పెళ్ళి అయ్యాక 3వ వీధిలో నాయుడు గారింట్లో రెండో అంతస్తులో కాపురం" అంది.

అక్క వంక ఆశ్చర్యంగా చూస్తూ "ఎక్కడ?" మళ్ళీ రెట్టించాను. అడ్రసు నిజం! అక్క చెప్పిన అడ్రసుకు నా మనసులో ఆనందం తన్నుకువచ్చింది. 'దేవుడున్నాడు' అనిపించింది.

"అక్కా! అతను పెళ్ళి చేసుకున్నది వేరే ఎవర్నో కాదు, నేను సాయంత్రం ట్యూషన్‌కు వెళ్తున్నానే ఆ లెక్చరర్‌నే" హఠాత్తుగా మీ ముఖం నా ముందు కదలాడగానే ఎందుకో బాధతో నా మనసు ఊగిసలాడింది. అంతే! ఇంట్లో ట్యూషన్ పేరుతో మీ అభిమానాన్ని సంపాదించి, అతను తన బీరువాలో రహస్యంగా దాచుకొన్న ప్రేమలేఖల్ని దొంగిలించి పారిపోతూ మీ కంట బడి, మీ మనసులో నీచాతినీచంగా మిగిలిపోయాను.

చరణ్ చెప్పడం ఆపాడు!

అప్పటివరకూ ఎంతో శ్రద్ధగా చరణ్ చెబుతున్నది కథలా వింటున్న మంజుల ఆఖరి మాటలకు ఉలిక్కిపడింది. పక్కలో బాంబు పెట్టినట్లుగా అదిరిపోయింది.

"చరణ్! అంటే మీ అక్కని మోసం చేసింది...!"

"అవును. అతనే!" చరణ్ ఆవేదనగా అన్నాడు.

"చరణ్!" ఓదార్పుగా అతని భుజం మీద చేయి వేసింది.

"మీరంటే పిచ్చి అభిమానం నాకు. అయ్యో! ఇంత మంచి వ్యక్తికి అలాంటి దుర్మార్గుడు భర్తా! అలాగని నిజం చెబితే మీ కాపురంలో చిచ్చుపెట్టిన వాడినవుతాను. అప్పుడెంతగా సంఘర్షణ అనుభవించానో మీకు తెలియదు. అందుకే మీ జీవితాల్నుంచి నేను అందనంత దూరంగా వెళ్ళిపోయి, మీ దృష్టిలో అపరాధిగా మిగిలిపోయాను" గద్గదికంగా అన్నాడతను.



## హృతిక్‌తో నటించాలనుంది

కత్రినా కైఫ్ ఇప్పుడు బాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్. అయితే ఆమెకి మాత్రం ఓ హీరోతో కలిసి నటించాలని వుంది. అతనెవరో తెలుసా? హృతిక్ రోషన్. హృతిక్‌తో నటించే చాన్స్ ఎప్పుడొస్తుందో అని ఎదురుచూస్తున్న కత్రినా తన చెల్లెలు ఇసబెల్లెని కూడా బాలీవుడ్‌లోకి తీసుకొద్దామనుకుంటోందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఇంకా ఏ సంగతీ చెప్పడం లేదు కత్రినా. అయితే కత్రినా సోదరి మాత్రం సినిమాల్లోకి రావడం ఖాయం అనే అంటున్నారు బాలీవుడ్ జనాలు.

"చరణ్!" ఆమె గొంతు వణికింది. "ఎంత పొరపాటుగా నిన్ను ఊహించుకొన్నాను? నన్ను క్షమించు"

"అంత మాటనకండి. అక్కకి పెళ్ళయి, పిల్లాపాపలతో సుఖంగా వుంది. మీరు హ్యాపీగా వున్నారు. నాకంతే చాలు. మీకు శశాంక్‌గారి భార్యగా ఈ విషయాలన్నీ చెప్పాను. అదే మీరు రమణారావుగారి భార్యగా వుండి వుంటే మటుకు, ఈ నిజాన్ని ఎప్పటికీ బయట పెట్టేవాడిని కాను. మీ ముందు జీవితాంతం దోషిలా మిగిలిపోవడానికే ఇష్టపడేవాడిని. నాలోనే ఆ నిజం సమాధి అయిపోయేది."

"చరణ్! కళ్ళతో చూసిందే నిజం అంటారు. కానీ కంటికి కనిపించినా 'నిజం కాని ఋజువు'ను ఇన్నేళ్ళ తర్వాత తెలుసుకున్నాను" ఆర్ద్రంగా అందామె, గతాన్ని జ్ఞాపకం చేసుకుంటూ.

"చరణ్! రమణారావుతో నాకు పెళ్ళయినప్పట్నుంచి అతని ప్రవర్తన చాలా తేడాగా వుండేది. చాలా సులువుగా అబద్ధాలాడేవాడు. చెడు తిరుగుళ్ళు తిరిగేవాడు. అతనిలో ఇద్దరు మనుష్యులు వుండేవాళ్ళు. అయినా సరే, అతని విరుద్ధ ప్రవర్తన మార్చడానికి, కాపురం సవ్యంగా నడపడానికి నేను చాలా ప్రయత్నం చేసాను. ఆఖరికి నా మనసు చంపుకొని అతనికి అనుగుణంగా మారడానికి సిద్ధపడ్డాను. కానీ రాను రాను అతనిలోని శాడిస్టుని భరించలేకపోయాను. చివరికి విడాకులు తీసుకోవడం నాకు తప్పలేదు" భారంగా అంది మంజుల.

"ఆ దుర్మార్గుడు ఇప్పుడు ఎక్కడున్నాడు?" చరణ్ కోపంగా అన్నాడు.

"ఎయిడ్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో!" నిర్లిప్తంగా అంది.

షాక్ తిన్నాడతను. "నిజమా! అతనికి ఎయిడ్స్ సోకిందా?" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును. ఇప్పుడతన్ని చూస్తే నాకు చాలా జాలి అనిపిస్తుంది!"

"మరి మీ ఆరోగ్యం?" ఆందోళనగా అడిగాడు.



"అదృష్టవశాత్తు మేం విడిపోయాక అతనికి ఎయిడ్స్ సోకింది. ఇప్పుడతను పాపం చివరి స్టేజిలో వున్నాడు"

"మిమ్మల్ని ఇంతగా వేధించి, బాధించినా కూడానా.." చిత్రంగా ఆమె వంక చూసాడు.

"ఇంకా అతని మీద జాలిపడుతున్నారా?"

"పాపం అతనికేం మిగిలింది చెప్పు ఇప్పుడు. యవ్వనపు హోరులో కన్నుమిన్ను ఎరక్క తిరిగిన చెడు తిరుగుళ్ళ ఫలితం... ఒక జీవితం. అది తెలుసుకొనేలోపు ఆ దీపం ఆరిపోతుంది. ఆ దీపం ఆరిపోవడమే కాక తన చుట్టూ వున్నవారికి కూడా అంటించి వాళ్ళని దిక్కులేని వాళ్ళను చేయడమే కాకుండా, బతికి ఉన్న జీవచ్ఛవాలుగా మారుస్తోంది. అంతటి మహమ్మారి ఆ ఎయిడ్స్ రోగం! ఇది అనుభవం మీద కాని ఏ మనిషికి తెలిసి రాదు. ఏం చేస్తాం?"

"శశాంక్, నేను అప్పుడప్పుడు హాస్పిటల్‌కు వెళ్ళి చూసి వస్తూంటాం!" అంది నిట్టూరుస్తూ.

హిమాలయాలంత ఔన్నత్యం ఉన్న ఆమె వ్యక్తిత్వం అతన్ని అబ్బురపరిచింది.

"మరి శశాంక్ ఎలా పరిచయమయ్యారు?" ఆసక్తిగా ముందుకు వంగుతూ అడిగాడు చరణ్.

"శశాంక్ నాకు దేవుడిచ్చిన అదృష్టం. అందుకే అంటారు చూడు, 'దేవుడు ఒక దోవ మూసినా, ఇంకో దోవ తెరుస్తాడని' శశాంక్ రూపంలో మరో జీవితాన్ని ఆ దేవుడు నాకు ప్రసాదించాడు. అతనే నా జీవితంలోకి రాకపోయి వుంటే కనుక డిప్రెషన్‌ని తట్టుకోలేక నేనేమై పోయేదాన్నో చివరికి. విడాకులు తీసుకున్నాక నా మైండ్ డైవర్షన్ కోసం మా నాన్నగారు యూనివర్సిటీలో పిహెచ్‌డి కోసం చేర్పించారు. అక్కడికి అప్పుడప్పుడు అతను 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్' క్లాసులు ఇవ్వడానికి వస్తూండేవాడు. అలా అతనితో మొదలైన పరిచయం ఇవాళ నన్ను ఓ మనిషిగా నిలబెట్టి నాకు మరో జన్మనిచ్చింది" ఉద్వేగంగా అంది మంజుల.

"దేవుడు ఎప్పుడూ మంచివాళ్ళకు అన్యాయం చేయడండీ!" చరణ్ ఆనందంగా అన్నాడు.

"కరెక్ట్! అందుకే మంజుల నా భార్య కావడం వల్ల నేను చాలా లక్కీఫెలో అయ్యాను" శశాంక్ అప్పుడే లోపలికి వస్తూ అన్నాడు.

"అబ్బా! శశాంక్! మీరు మరీనూ..." గబగబా లేచి అతనికి చిరునవ్వుతో ఎదురు వెళుతూ అంది మంజుల!

ఆమె భుజం మీద చేయి వేసి, అపురూపంగా లోపలికి తీసుకువచ్చాడు శశాంక్!

కన్నుల పండువుగా ఉన్న వాళ్ళ జంటను చూసి ఆనందంతో పొంగిపోయాడు చరణ్, తేలికైన మనసుతో!

★

## ఇక్కడే బావుంది

దక్షిణాది తారలు చాలామంది ఇటీవల హిందీలోకి వెళ్తున్నారు. మరి ఎంతో పాపులారిటీ సంపాదించుకున్న నయనతార కూడా హిందీలోకి అడుగుపెడుతుందా? అనే దౌటుతో 'మీరెందుకు బాలీవుడ్‌కి వెళ్లడం లేదు?' అని ఓ ఆసామీ నయనతారని ఇటీవల ప్రశ్నించాడు. దీనికి నయనతార 'నాకు ఇక్కడ దక్షిణాదినే ఎంతో బావుంది. ఓ హిందీ హీరోయిన్ తీసుకునేంత పారితోషికమే నాకు ఇక్కడే దొరుకుతోంది. అలాంటప్పుడు అనవసరంగా రిస్కు తీసుకుని హిందీలో ప్రయత్నాలు చేయడం నాకిష్టం లేదు' అని తేల్చిచెప్పేసింది నయనతార.